క్లుప్తంగా

ఆస్పత్రుల్లో అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్



హెల్త్‌సిటీ అపోలోలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఆరిలోవ: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హెల్త్ సిటీలో అపోలో, కేర్ ఆస్పత్రుల్లో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. షార్ట్ సర్క్యూట్ సంభవించినప్పుడు ఆస్పత్రుల్లో ఉన్న వారిని ఏవిధంగా బయటకు తరలించి రక్షించుకోవాలి, మంటల నివారణ, తదితర వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి పి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలో పినాకిల్ ఆస్పత్రి ప్రాంతంలో శ్రీసాయి భగత్‌సింగ్, అమ్మ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆస్పత్రులకు వెళ్లిన రోగులు, వారి బంధువులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ప్రతిరోజు తాగునీరు అందుబాటులో ఉంటుందని ఆటో డ్రైవర్లు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

మజ్జిగ పంపిణీ



చలివేంద్రం ప్రారంభిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో కళాభారతి తోపుడు బళ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

అండగా ఉంటా.. ఆదరించండి

- సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ పిలుపు



23వ వార్డులో మద్దిలపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీకి తిలకం దిద్దుతున్న మహిళ



19వ వార్డులో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం శుక్రవారం 19వ వార్డులో జోరుగా సాగింది. ఇందులో భాగంగా 93వ రోజు 19వ వార్డు పెదజాలరిపేటలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎల్లవేళలా అండగా ఉంటానని, తనను ఆదరించాలని పెదజాలరిపేట ప్రజలకు ఎంవీవీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అద్భుతమైన సేవలు అందించిన వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ప్రజా సంక్షేమం ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రాష్ట్రానికి, ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ప్రచారంలో భాగంగా ఎంవీవీకి ప్రతి ఇంట ఓటర్లు నిరాజనాలు పలికారు. హారతులు పడుతూ ఎంవీవీని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో..

ఏయూ క్యాంపస్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీల తరఫున జీవీఎంసీ 20వ వార్డు కాగితాల వారి వీధిలో ఆ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్ది పోలిరెడ్డి, బి.రమాదేవి, పండరీబాయి, బోర కుమార్‌రెడ్డి, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ముమ్మర ప్రచారం

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 23వ వార్డులో మద్దిలపాలెం, చైతన్యనగర్, కేఆర్‌ఎం కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ గుడ్ల విజయ సత్యారెడ్డితో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు



20వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విశాఖ సాగరం తీరం సాక్షిగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ప్రమాణ స్వీకరణ చేయాలంటే ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు. ఉత్తరాంధ్రను ఉత్తి రాంధ్రగా వదిలేసిన చంద్రబాబు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు కోసం వస్తున్నారో ప్రశ్నించాలన్నారు. ఈ సారి ఓటు అనే ఆయుధంతో చంద్రబాబును చిత్తుగా ఓడించాలని ఎంవీవీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జేసీఏ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు, అభిమానులు, కస్టర్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

- నామినేషన్ ప్రక్రియలో ఎన్నికల నియమాలు పాటించని వెలగపూడి
- మండుటెండలో సాధారణ జనాలకూ నరకయాతన



టీడీపీ ర్యాలీ కారణంగా నిలిచిన ట్రాఫిక్



మైనర్ బాలికలతో ర్యాలీకి వెళుతున్న ఆటో

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు నామినేషన్ ప్రక్రియలో ఎన్నికల నిబంధనలు అడుగడుగునా ఉల్లంఘించారు. జన సమీకరణ నుంచి రహదారులపై ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించినంత వరకు నిబంధనలు భేఖాతర్ చేశారు. నియోజకవర్గ పరిధిలో 15 వార్డుల నుంచి డబ్బులు ఇచ్చి జనాలను ఆటోలు, బైక్‌లలో తరలించారు. పోటీలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలి. ఇక్కడ మాత్రం నిబంధనలను గాలికి వదిలేశారు. ఆరిలోవ, పెదవాల్తేరు. ఎంవీపీ కాలనీ ప్రాంతాలలో రోడ్లపై ఆటోలు, ద్విచక్ర వాహనాలను యథేచ్ఛగా గంటల తరబడి నిలిపేశారు. ఈలోగా ఇంటింటికి వెళ్లి డబ్బులు ఆశ చూపి జనాలను తీసుకొచ్చారు. బైకులపై వెళ్లేవారు దారిపొడవునా విన్యాసాలు చేస్తూ జనం రాకపోకలకు ఆటంకం కలిగించారు. ట్రాఫిక్ నిబంధనలు సైతం భేఖాతర్ చేశారు. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చొని కొందరు, వెనక వేళాడుతూ పలువురు ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణించారు.

మండుటెండలో గంటల తరబడి..

వెలగపూడి శుక్రవారం మధ్యాహ్నం 2.14 గంటలకు నామినేషన్ వేయడానికి నిర్ణయించుకున్నారు. దీంతో బల ప్రదర్శన కోసం ఉదయం 11 గంటల నుంచే జన సమీకరణ చేశారు. ఆరిలోవ, తోటగరువు, బాలాజీనగర్, రవీంద్రనగర్, జోడుగుళ్లపాలెం, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం ప్రాంతాల నుంచి జనాలను ఎంవీపీ కాలనీ టీడీపీ కార్యాలయం వద్దకు తరలించారు. వారంతా అక్కడ గంటన్నరకు పైగా ఎండలో నిరీక్షించారు. మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత ర్యాలీగా బయలుదేరి బీచ్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వరకు వెళ్లారు. అక్కడ మరో 2 గంటలు సేపు జనాలను ఎండలో వదిలేశారు. కలెక్టరేట్‌లో నామినేషన్ ప్రక్రియ ముగిసిన అనంతరం బీచ్‌రోడ్డులో నిరీక్షించిన జనాలకు రూ.200 చొప్పున డబ్బులు, బిరియాని ప్యాకెట్ చేతిలో పెట్టి పంపించారు.

ముఖం చాటేసిన బీజేపీ కేడర్

వెలగపూడి నామినేషన్‌కు నియోజకవర్గంలో బీజేపీ క్యాడర్ ముఖం చాటేసింది. జనసేన కార్యకర్తలు ఆ పార్టీ జెండాలతో అక్కడక్కడా కనిపించారు. బీజేపీ కార్యకర్తలు మాత్రం పాల్గొనలేదు. ఆ పార్టీ జెండా ఎక్కడా కానరాలేదు. విశాఖ ఎంపీ సీటు బీజేపీకి కేటాయించలేదనే అసంతృప్తితో ఆ పార్టీ నాయకులు ప్రచారాలకు దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.

మైనర్ల తరలింపు

ఎంవీపీ కాలనీ: వెలగపూడి నామినేషన్ కోసం ఎంవీపీ కాలనీ టీటీడీ, గిరిజన భవన్, ఉషోదయ కూడళ్ల ఆటోలను అడ్డదిడ్డంగా నిలపడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు హారన్లు మోగిస్తూ నానా హంగామా చేశారు. బల ప్రదర్శన కోసం మైనర్లను సైతం ఆటోల్లో ర్యాలీకి తరలించారు.

మానిటరింగ్ కేంద్రాల పరిశీలన

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర వ్యయ పరిశీలకురాలు నీనా నిగం, విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకురాలు రెంగ రాజన్, భీమిలి, తూర్పు, దక్షిణ నియోజకవర్గాల వ్యయ పరిశీలకురాలు సౌమ్య పాండే జైన్, ఉత్తర, పశ్చిమ, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల వ్యయ పరిశీలకురాలు అక్తా జైన్‌లు కలెక్టరేట్ సముదాయంలోని వివిధ మానిటరింగ్ కమిటీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ సేవలు, పరిస్థితులను గమనించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.



మానిటరింగ్ కేంద్రాల్లో సేవలను వివరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

తూర్పులో మూడు నామినేషన్లు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల వేడి మొదలైంది. శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజు తూర్పు నుంచి ఎవరూ నామినేషన్లు వేయలేదు. రెండో రోజు శుక్రవారం మాత్రం రెండు పార్టీలకు చెందిన ముగ్గురు నామినేషన్లు వేశారు. వీటిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా వెలగపూడి రామకృష్ణబాబు, ఆయన సతీమణి సుజన రెండేసి సెట్లు నామినేషన్లు వేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఇ.హైమావతి ఒక సెట్ నామినేషన్ వేశారు. ఈ ముగ్గురూ రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్‌కు కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలు సమర్పించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

మద్దిలపాలెం : దోమల వృద్ధిని అరికట్టడానికి ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను ప్రతి శుక్రవారం తొలగించాలని జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ శేషుబాబు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం పరిసరాల్లో నీటి నిల్వల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటి నిల్వ ద్వారా దోమల ఉత్పత్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం విధిగా నీటి నిల్వల తొలగింపు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రామునాయుడు, ఏఎన్‌ఎం, ఆశా, జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిలపాలెంలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

ట్రాఫిక్ పటిష్టతకు కొత్త పరికరాలు

బీచ్ రోడ్డు: నగరంలో ట్రాఫిక్‌ను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు భారీ సంఖ్యలో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని సీపీ రవిశంకర్ అయ్యర్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషన్ల కోసం కొనుగోలు చేసిన బ్రీత్ ఎనలైజర్స్, వీల్ లాక్స్, బాడీ వార్న్ కెమెరాలు, రేడియం జాకెట్స్, బటన్ లైట్లను శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణకు మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ పరికారాలు ఎంతో దోహదపడతాయన్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, దీన్ని అరికట్టేందుకు 200 బ్రీత్ ఎనలైజర్స్‌ను కొనుగోలు చేశామన్నారు. రహదారులపై పార్కింగ్ చేసే వాహనాల కోసం 200 వీల్ లాక్స్‌ను కొనుగోలు చేశామన్నారు. వీటితో పాటు పోలీసుల కోసం 200 బాడీ వార్న్ కెమెరాలు, 400 రేడియం జాకెట్స్, 400 బటన్ లైట్లను కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.



బ్రీత్ ఎనలైజర్స్‌ను ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

సీఎం జగన్‌తోనే పేదల అభ్యున్నతి



వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌ను చూపిస్తూ మాట్లాడుతున్న ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 22వ వార్డులో మేము సిద్ధం సభ

బీచ్ రోడ్డు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముందు పేదవాడు ఆర్థికంగా మెరుగుపడాలని, అందుకోసమే సంక్షేమ పథకాలను నేరుగా వారికే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డులో మేము సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం, రాష్ట్రం అభివృద్ధి కేవలం జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ సర్కారుకు దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలను పేదలకు అందకుండా దోపిడీ చేసిన జన్మభూమి కమిటీలను తరిమికొట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి సంక్షేమాన్ని సీఎం జగన్ చేరువ చేశారని గుర్తు చేశారు. అవ్వాతాతలకు ఇంటి వద్దనే పెన్షన్ అందించి, వ్యయ ప్రయాసల నుంచి వారికి విముక్తి కల్పించారన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ విద్య, వైద్యాన్ని రాష్ట్ర ప్రజలకు అందించామన్నారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి.. నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ ఐదేళ్లలో తూర్పు నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రతీ వార్డును అభివృద్ధి బాట పట్టించామన్నారు. వార్డును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పి.నారాయణ, వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్, అల్లంపల్లి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తికి నివాళి

ఆరిలోవ: సీపీఎం నాయకుడు వి.కృష్ణమూర్తి మొదటి వర్ధంతి శుక్రవారం ఆరిలోవ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు అజయ్‌శర్మ, ఆర్.కె.ఎస్.వి.కుమార్, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌శర్మ మాట్లాడుతూ కృష్ణమూర్తి ఆదర్శ కమ్యూనిస్ట్ నాయకుడని కొనియాడారు. ఆరిలోవ కాలనీ ఏర్పాటు సమయంలో మౌలిక వసతులు కల్పించడంలో ఎంతో కృషి చేశారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ కృష్ణమూర్తి మరణించిన తర్వాత కూడా ప్రజలకు ఉపయోగపడేలా ఆయన పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, ఆరిలోవ జోన్ సీపీఎం నాయకులు కుమార్, శంకర్, సత్యనారాయణ, రంగమ్మ, సూర్యమణి, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు అజయ్‌శర్మ, ఆర్కేఎస్‌వీ కుమార్

21, 22 తేదీల్లో సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం : సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నామని ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి డి.సుబ్రహ్మణ్యం వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాల వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులు, వెన్నుముక నొప్పి, మెడ నొప్పి, భుజాల నొప్పి, కీళ్ల నొప్పులు సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు జైశ్రీరామ్ చికిత్స చేయనున్నారన్నారు.

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



పెయింటింగ్స్ చూపుతున్న విద్యార్థులు

సీతంపేట: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా విద్యార్థులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 6 నుంచి 13 ఏళ్ల వయసు విద్యార్థులు 120 మంది పాల్గొని తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల స్థాయిని బట్టి గ్రేడ్‌లుగా విభజించి పోటీలు నిర్వహించారు. గ్రేడ్ 1, 2 తరగతుల విభాగంలో ఎస్‌కె.ఖాజీనా ఖానం, భవానీ, పి.భవ్యశ్రీ, దేవిశ్రీప్రియ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జూనియర్ కేటగిరిలో దిలీప్ చక్రవర్తి, ఎల్.ధృవికా ఆర్యానా, ఎస్.నిత్యశ్రీ, పి.లిఖిత, సీనియర్ విభాగంలో తస్మియా సబ్రీన్, ఎన్.రక్షిత, వాసియుల్లా సాజిద్, కె.జెస్సికా గ్రేసీ గెలుపొందారు. విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం కథకులు సీతా శ్రీనివాస్ తన మంత్రముగ్ధమైన కథలతో పిల్లలను ఆకట్టుకున్నారు. పిల్లలు ఉత్సాహంగా రైమ్స్, పాటలు పాడారు.

నోటీస్ బోర్డుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాలు

ఎంవీపీ కాలనీ: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు నోటీస్ బోర్డుల్లో పొందుపరచాలని జిల్లా వైద్య ఆర్యోగ శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల స్పెషలిస్ట్ వైద్యులతో తన కార్యాలయం నుంచి ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యుల పేర్లు, వారు ఏ రోజు, ఏ సమయంలో ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంటారో కచ్చితంగా నోటీసు బోర్డులో పొందుపరచాలన్నారు. ఆయా వివరాలను ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు తెలియజేయాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా మందులు నిల్వ చేసుకోవడం, వాటిని రోగులకు ఉచితంగా పంపిణీ చేయడం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ స్టీవ్‌డోర్స్ నూతన కమిటీ ఎన్నిక



సాంబశివరావు

దాబాగార్డెన్స్ : విశాఖ స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ఎండీ డాక్టర్ జి. సాంబశివరావును అధ్యక్షుడిగా, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ కంపెనీ ప్రతినిధి జేకే నాయక్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా గంగిరెడ్డి షిప్పింగ్ కంపెనీ ప్రతినిధి కె. సత్యనారాయణరెడ్డి, ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ ప్రతినిధి జి. రాజేష్, సహాయ కార్యదర్శులుగా బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ ప్రతినిధి ఎస్‌వీజే కిరణ్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజస్‌కు చెందిన సీహెచ్ వెంకట్రావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డి. శ్రీనివాసరెడ్డి(శ్రీనివాస ట్రాన్స్‌పోర్ట్), కె. రోహిత్ (కేఆర్ అండ్ సన్స్), పి. రాహుల్(ప్రీమియేచర్ షిప్పింగ్ సర్వీసెస్), ఎం. భూపేష్ (నవ్‌షిప్ మెరైన్ సర్వీసెస్)ను ఎన్నుకున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



హర్షవర్ధన్ మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్తాపం చెంది ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం శాంతినగర్–1లో కుటుంబంతో కలిసి నివసిస్తున్న పి.హర్షవర్ధన్ 10వ తరగతి వరకు చదువుకున్నాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. మూడు నెలల కిందట కూడా మనస్తాపంతో ఒకసారి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన అనంతరం సుమారు 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులందరూ డాబా మీద నిద్రపోవడానికి వెళ్లారు. యువకుడు కింద బెడ్ రూమ్‌లో రోజూ మాదిరి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో వారు నిద్రలేచి కిందకి వచ్చి తలుపులు తీసి చేసేసరికి ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. వారంతా ఇరుగు పొరుగువారి సహాయంతో హర్షవర్ధన్ మృతదేహాన్ని కిందకి దించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.